సాక్షి
పెద్దపల్లి
మంగళవారం । 31 । జనవరి । 2023



ఆసరాపై ఆశలు..!

పింఛన్ లబ్ధిదారు మరణిస్తే వారి జీవిత భాగస్వామికి ప్రభుత్వం ఆసరా కల్పిస్తుంది.

8లో



విన్నపాలు వినవలె..

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 54 దరఖాస్తులను కలెక్టర్ సంగీత స్వీకరించారు.

8లో

గరిష్ఠం/కనిష్ఠం
32.0/19.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. సాయంత్రం చలితీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

నేడు సదరం స్లాట్ బుకింగ్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో దివ్యాంగుల వైద్య నిర్ధారణ పరీక్షల కోసం మంగళవారం మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవచ్చని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్ తెలిపారు. తాత్కాలిక సదరం సర్టిఫికెట్ ఉన్నవారు కొత్తగా శారీరక వైకల్యంగలవారు స్లాట్ బుక్ చేసుకుని ఫిబ్రవరి 2, 16 తేదీల్లో నిర్వహించే క్యాంపు స్లాట్ పొందాలని, దృష్టి లోపం ఉన్నవారు ఫిబ్రవరి 9న, మానసికవైకల్యం గల వారికి ఫిబ్రవరి 15న, వినికిడి లోపం ఉన్నవారికి ఫిబ్రవరి 23నాటి స్లాట్‌లు నమోదు చేసుకోవాలన్నారు.

పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,901



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పత్తి క్వింటాల్‌కు రూ.7,901 పలికింది. కనిష్ఠంగా రూ.7,291, సరాసరి రూ.7,851గా నమోదైందని ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

అందుబాటులో కాంపిటీషన్ పుస్తకాలు



సుల్తానాబాద్ గ్రంథాలయంలో రఘువీర్ సింగ్

సుల్తానాబాద్: వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ అన్నారు. సోమవారం సుల్తానాబాద్ గ్రంథాలయాన్ని సందర్శించారు. పుస్తకాలు ఎలా ఉన్నాయని నిరుద్యోగులను అడిగి తెలుసుకున్నారు. పెద్దపల్లి, గోదావరిఖని, రామగుండం ప్రాంతాల్లోని లైబ్రరీలో చదువుకున్న పలువురు కానిస్టేబుల్, ఎస్సైలుగా ఎంపికయ్యారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది పోటీ పరీక్షల్లో రాణించాలని సూచించారు. ఆయన వెంట లైబ్రేరియన్ దీప, పలువురు ఉన్నారు.


రైళ్ల రాకపోకలు.. స్టేషన్ నిర్వహణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: రైళ్ల రాకపోకలు.. రైల్వేస్టేషన్ల నిర్వహణపై విద్యార్థులకు రైల్వే అధికారులు అవగాహన కల్పించారు. పెద్దపల్లిలోని గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థులు సోమవారం పెద్దపల్లి రైల్వేజంక్షన్‌ను సందర్శించారు. రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థ, ఒకే లైన్‌లో రెండురైళ్లు వస్తే ట్రాక్ మార్పే విధానం, ఆన్‌లైన్‌లో టికెట్ బుకింగ్ చేసే తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైల్వేస్టేషన్‌లో పాటించాల్సిన నిబంధనలు, ప్లాట్‌ఫాం టికెట్, రైళ్లలో రకాలు తదితర విషయాలను విద్యార్థులకు అర్థమయ్యేలా రైల్వే అధికారులు వివరించారని విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు.

బీసీలకు దక్కాల్సిన వాటా ఇవ్వాల్సిందే..



దీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న మల్లేశం, శ్రీమాన్

పెద్దపల్లిరూరల్: జనాభాలో అధికశాతం ఉన్న బీసీలకు అన్నిరంగాల్లో దక్కాల్సిన వాటా ఇప్పించేందుకు చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ గాండ్ల మల్లేశం, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరి శ్రీమాన్ అన్నారు. జిల్లాకేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా సాగుతున్న దీక్షలకు వారు సోమవారం సంఘీభావం ప్రకటించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 27శాతం రిజర్వేషన్‌ను 52శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. అగ్రవర్ణాల ఆధిపత్యంలో బీసీలు మరింత అణగారిపోతున్నారని పేర్కొన్నారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గొట్టె రాజు, బాలకళ్యాణ్, వెంకటేశ్, శేషాద్రి, గోపాల్, మధు, శారద, శోభ, అరుణ, రవికుమార్ తదితరులున్నారు. దీక్షల్లో పూసాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

'కాషాయం'లో కయ్యం..!

- బీజేపీలో అంతర్గత వర్గపోరు
- వివేక్ వర్సస్ అసెంబ్లీ నేతలు
- పార్టీ బలోపేతంపై లేని దృష్టి
- ప్రజా సమస్యలనూ పట్టని తీరు
- పట్టని అధిష్టానం.. అయోమయంలో కేడర్



సాక్షి, పెద్దపల్లి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సత్తాచాటుతామని, అధికారం చేపట్టబోతున్నామని బీజేపీ అగ్రనేతలు తరచూ చెప్పేమాటలు. కానీ.. జిల్లాలో మాత్రం అంతర్గత కుమ్ములాటలు, గ్రూప్ రాజకీయాలతో రోజురోజుకూ సతమతమవుతోంది. పాత క్యాడర్, కొత్తగా వచ్చిన నేతల మధ్య సయోధ్య కుదరక.. కొందరు నేతల ఒంటెత్తు పోకడలతో గ్రూప్‌లుగా ఏర్పడి బహిరంగంగా విమర్శలతో రచ్చకెక్కుతున్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో పార్టీ బలోపేతం, ప్రజాసమస్యలపై పోరాటం చేయకుండా ఒకరిపై మరొకరు పరస్పర విమర్శలతో సమయం వృథా చేస్తున్నారని కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్న క్రమంలో కాషాయంలో వర్గపోరుతో నెలకొన్న మంటలు పార్టీకి చేటు చేస్తాయని బీజేపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

గతంలోనూ వివేక్‌పై విమర్శలు..

పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తరువాత బీజేపీలో చేరినప్పటి నుంచి మాజీ ఎంపీ గడ్డం వివేక్ తీరుపై జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల సీనియర్లు, ఇతర నాయకులు మండిపడుతున్నారు. పార్టీతో సంబంధం లేకుండా తనకంటూ సొంత క్యాడర్, టీంను ఏర్పాటు చేసుకునేందుకే పార్లమెంట్ పరిధిలో స్థానిక నేతల ప్రమేయం లేకుండా గ్రూపు రాజకీయాలు అమలు చేస్తున్నారని పెద్దపల్లి, రామగుండం, మంథని, ధర్మపురి అసెంబ్లీ నేతలు పలు సందర్భాల్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మంచిర్యాలలో బోడ జనార్దన్ నివాసంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ నేతలు వివేక్‌కు వ్యతిరేకంగా సమావేశమవడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. ఆ తర్వాత సోమరాపు సత్యనారాయణ ఇంట్లో సమావేశమై వివేక్ వ్యవహారశైలిపై అధిష్టానానికి ఫిర్యాదు కూడా చేశారు. ఇటీవల ధర్మపురి నియోజకవర్గ నేతలు సైతం వివేక్‌ను అడ్డుకున్నారు. తాజాగా పెద్దపల్లిలో నేతలు సైతం బహిరంగ విమర్శలు ఎక్కుపెట్టారు.

అంతటా అదే పరిస్థితి..

పెద్దపల్లి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, గొట్టెముక్కల సురేష్‌రెడ్డి, రామగుండంలో సోమారపు సత్యనారాయణ, కౌశిక హరి, బల్మూరి వనిత, కాసిపేట లింగయ్య, మంథనిలో సునిల్‌రెడ్డి, సనత్‌కుమార్ ఎవరికి వారే కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు.

పట్టించుకోని అధిష్టానం.. అయోమయంలో శ్రేణులు

జిల్లాలో గాడితప్పిన బీజేపీని గాడిన పెట్టేందుకు రాష్ట్ర నాయకత్వం, బండి సంజయ్ దిద్దుబాటు చర్యలు తీసుకోవటం లేదని సమాచారం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి తీరుతుందని నేతలు చెబుతున్నారు. జిల్లాలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రస్తుతం జిల్లాలో ఒక నియోజకవర్గం నుంచి బీజేపీకి గెలుపు అవకాశాలుండగా.. వివేక్ గ్రూప్ రాజకీయాలతో సదరు నేత సైతం స్వంతత్ర అభ్యర్థిగా బరిలో దిగేందుకు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా అధ్యక్ష పదవికి సోమారపు సత్యనారాయణ గతంలోనే రాజీనామా చేసినప్పటికీ ఇప్పటికీ ఆమోదించకపోవడం, ఇతర అనుబంధ కమిటీలను నియమించకపోవడంతో పార్టీనేతలు, కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం జిల్లాపై దృష్టి సారించి పార్టీని గాడిన పెట్టాలని కోరుతున్నారు.

ఎవరికి వారే..

ఇటీవల జిల్లాకేంద్రంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్.. ఇటీవల పార్టీలో కొత్తగా చేరిన సురేష్‌రెడ్డితో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమయంలో పలువురు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ కార్యక్రమానికి పట్టణ అధ్యక్షుడినిగానీ.. ఇతర సీనియర్ నేతలనుగానీ ఆహ్వానించలేదు. దీంతో గుజ్జుల రామకృష్ణారెడ్డి వర్గీయులు ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివేక్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని ఘాటుగా విమర్శలు గుప్పించారు. తీరు మార్చుకోకపోతే వివేక్‌ను తరిమికొడుతామని హెచ్చరించారు కూడా. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రత్యర్థి పార్టీలతో పోటీపడాల్సిన నేతలు, వారిలోవారే.. ఇలా పోటాపోటీగా సమావేశాలు నిర్వహించుకుంటూ పరస్పర విమర్శలతో బలహీనపరుస్తున్నారని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సుపారీ హత్య..?



ప్రధాన చౌరస్తా మీదుగా వెళ్తున్న సుమన్ అంతిమయాత్ర

- జైల్లో పరిచయమైన ఖైదీ సాయం..?
- ఎప్పటి నుంచో రెక్కీ నిర్వహిస్తున్న నిందితులు..
- అదును చూసి వేటకొడవళ్లతో దాడి
- ఉద్రిక్తంగా మారిన సుమన్ అంతిమయాత్ర

గోదావరిఖని: పారిశ్రామిక ప్రాంతంలో రౌడీషీటర్ల ఆగడాలకు అడ్డులేకుండాపోతోంది. నేర ప్రవృత్తిలో ఎంతకైనా తెగిస్తున్నారు. పోలీసులు స్టేషన్‌కు పిలిపిస్తూ.. కౌన్సెలింగ్ ఇస్తున్నా తమ నేరమయ జీవితానికి మాత్రం స్వస్తి పలకడం లేదు. గంజాయి వంటి మత్తుకు అలవాటు పడుతున్న యువత గ్రూపుల సంస్కృతికి తెరలేస్తోంది. ఈ క్రమంలో ఎవరైనా గొడవకు దిగితే దాడిచేయడంతోపాటు.. హత్యకూ వెనకాడటం లేదు. ఐదేళ్ల క్రితం శివకుమార్ అనే యువకుడిని ప్రధాన చౌరస్తాకు కొద్దిదూరంలో వేటకొడవళ్లతో దాడిచేసి హతమార్చారు. ఆ హత్యలో ప్రధాన నిందితుడైన మంథని సుమన్‌ను ఆదివారం అదే ప్రధాన చౌరస్తాలోనే నరికి చంపారు. ఈ హత్య ఈ ప్రాంతంలో భయాందోళన రేకెత్తించింది. రామగుండంలో పోలీస్ కమిషనరేట్ ఏర్పడ్డాక నేరాల అదుపులో పట్టు సాధించినా.. ఇలాంటి ఘటనలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ హత్యపై పోలీసు యంత్రాంగం లోతుగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హత్య వెనుక..

సుమన్ హత్యలో పాత నిందితుల పాత్ర ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో పలు కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీతో పరిచయం పెంచుకుని సుపారీ మాట్లాడుకుని ఈ ప్రాంతానికి తీసుకొచ్చినట్లు చెబుతున్నారు. సెంట్రల్ జైల్లో ఉన్నప్పుడే పరిచయం అయిన ప్రధాన నిందితుడే ఈ హత్యకు పథకం పన్నినట్లు తెలుస్తోంది. హత్య కేసులో ప్రధాన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

ఉద్రిక్తంగా సుమన్ అంతిమయాత్ర

దారుణ హత్యకు గురైన మంథని సుమన్ అంతిమయాత్ర సోమవారం ఉద్రిక్తతకు దారితీసింది. పోలీస్‌స్టేషన్ సమీపం నుంచి ప్రధాన చౌరస్తా మీదుగా యాత్ర చేపట్టారు. హత్య జరిగిన ప్రధాన చౌరస్తాకు రాగానే ప్రజలు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. ఇదే సమయంలో గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు రమేశ్‌బాబు, ప్రసాద్‌రావుతోపాటు పలు ప్రాంతాల నుంచి భారీగా పోలీసు బలగాలు మోహరించారు. దీంతో కొద్ది సేపు ప్రధాన చౌరస్తాలో ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు జోక్యం చేసుకుని మృతదేహాన్ని గోదావరి నది వైపు తీసుకెళ్లేలా ఒప్పించడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అంతిమయాత్ర అనుకున్న రూట్‌లో కాకుండా వేరే వైపు వెళ్లడంతో ఉద్రిక్తంగా మారి ఒక దశలో పోలీసులు లాఠీలకు పనిచెప్పాల్సి వచ్చింది.

ఫిబ్రవరిలో పోడు భూములకు పట్టాల పంపిణీ

- మంత్రి సత్యవతి రాథోడ్
- కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్

పెద్దపల్లిరూరల్: అర్హులందరికీ ఫిబ్రవరిలో పోడు భూముల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. అటవీశాఖమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో కంటివెలుగు, మన ఊరు మనబడి, పోడు భూములు, ఆయిల్ పామ్, టీచర్ల బదిలీలపై సోమవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. అడవులను కాపాడుతూనే నిబంధనల మేరకు పోడుభూముల పట్టాలను అందించాలని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. టీచర్ల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమం కింద పూర్తి చేసిన పాఠశాలలను ఫిబ్రవరి ఒకటిన ప్రారంభించాలన్నారు.

టీచర్లబదిలీలపై..

జిల్లాలో టీచర్ల బదిలీలపై ఏర్పాటు చేసిన మెడికల్ బోర్డులో 25 కేసులు పరిశీలించామని కలెక్టర్ సంగీత అన్నారు. జిల్లాలో ఎనిమిది ప్రభుత్వ కార్యాలయాలు సొంతభవనాల్లో ఇప్పటికీ ఉన్నాయని, సీటీఓ ఆఫీసు మాత్రమే అద్దెభవనంలో పనిచేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. వీలైనంత త్వరగా కలెక్టరేట్‌లోకి తరలిస్తామని వివరించారు. వీడియో కాన్ఫరెన్సులో ఆర్డీఓలు వెంకటమాధవరావు, వీరబ్రహ్మాచారి, ఏఓ ప్రసాద్, డీఎంహెచ్ఓ ప్రమోద్‌కుమార్, డీఈఓ మాధవి, డీఎఫ్ఓ శివయ్య, డీఏఓ ఆదిరెడ్డి తదితరులున్నారు.

కంటి పరీక్షలు చేయించుకోండి



శిబిరాన్ని పరిశీలిస్తున్న కృపాబాయి

పాలకుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న కంటివెలుగు మలివిడత కార్యక్రమాన్ని 18 ఏళ్లపైబడిన వారంతా సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ కృపాబాయి కోరారు. సోమవారం బసంత్‌నగర్ వర్కర్స్ క్లబ్‌లో కొనసాగుతున్న కంటివెలుగు వైద్యశిబిరాన్ని తనిఖీ చేశారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిబిరానికి వచ్చే వారికి తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఇన్‌చార్జి చైర్మన్‌గా శ్రీనివాస్

- జగిత్యాల మున్సిపల్ ఉత్కంఠకు తెర
- భోగశ్రావణి రాజీనామా ఆమోదం
- వైస్ చైర్మన్‌కే ఇన్‌చార్జి బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ రవి
- బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా వ్యవహారంలో ఇన్ని రోజులు కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. రాజీనామా ఆమోదం అవుతుందా.. లేదంటే రాజీకి వెళ్తారా అనే అనుమానాలకు ఫుల్‌స్టాప్ పడింది. చైర్‌పర్సన్ భోగ శ్రావణితో చర్చించిన కలెక్టర్ రవి.. ఆమె రాజీనామాను ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు.

కలెక్టర్ కార్యాలయానికి పిలిచి..

- సెలవులు ముగియడంతో సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి చైర్‌పర్సన్ భోగ శ్రావణిని కలెక్టర్ రవి పిలిచారు. 'ఈ లేఖ మీరే రాశారా..? పోర్టల్ ద్వారా వచ్చిందా..? రాజీనామా ఎందుకు చేశారు..? అనే విషయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆమె స్పందిస్తూ.. 'నా ఇష్టపూర్వకంగానే రాజీనామా చేశాను. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వేధింపుల వల్లే' పేర్కొన్నారు. దీంతో ఆ విషయాన్ని లేఖ ద్వారా ఇవ్వాలని కలెక్టర్ సూచించగా వెంటనే మరోసారి లేఖ రాసి ఇచ్చారు. సాయంత్రం 4 గంటలకు ఆమె రాజీనామాను ఆమోదించారు.

నాటకీయ పరిణామాల మధ్య..

నెల రోజులుగా జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ విషయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని కౌన్సిలర్లు ఈనెల 21న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు లేఖ ఇచ్చారు. అప్పటి నుంచి అవిశ్వాసం రగులుకుంటూ వచ్చింది. మొత్తం 33 మంది సభ్యులు చైర్‌పర్సన్ ఉండవద్దని మొదటి నుంచి ఏకతాటిపై ఉన్నారు. చివరగా 27 మంది ఎమ్మెల్యేకు లేఖ ఇచ్చారు. తదుపరి ఒక్కొక్కరుగా అవిశ్వాసం కాకుండా చైర్‌పర్సన్‌ను దింపేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ పరిణామాలన్నింటి మధ్య తానే రాజీనామా చేయాలని చైర్‌పర్సన్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఆ పరిణామం అధిష్టానానికి ఇబ్బందికరంగా మారింది. మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ, పార్టీ అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అందరినీ సమన్వయం చేసి రాజీనామా వెనక్కి తీసుకునేలా ప్రయత్నం చేసేలా చూద్దామనుకునే లోపే చైర్‌పర్సన్ ప్రెస్‌మీట్ పెట్టి నిర్ణయం వెల్లడించారు. అంతేకాదు ఎమ్మెల్యేపై తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఖచ్చితంగా ఆమెను పదవి నుంచి తొలగించాల్సిందేనని మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేపై కౌన్సిలర్లు ఒత్తిడి తీసుకువచ్చారు. అప్పటికే రాజీనామా లేఖ పంపించినప్పటికీ మూడు రోజుల అనంతరం కలెక్టర్ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను పదవీ నుంచి తొలగించడంతో తాము విజయం సాధించామని కౌన్సిలర్లు పేర్కొంటున్నారు.

మూడేళ్లకే రాజీనామా..

జగిత్యాల మున్సిపాలిటీగా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు ఆరుగురు చైర్మన్లు కొనసాగారు. ఏ చైర్మన్ అయినా పూర్తిస్థాయిలో ఐదేళ్ల పాటు పనిచేశారు. కానీ.. జగిత్యాల చరిత్రలో టీఆర్‌ఎస్ మొదటిసారి పాలకవర్గంలోనే మూడేళ్లకే రాజీనామా చేయడం గమనార్హం.

శ్రావణి పయనం ఎటు..?

- భోగ శ్రావణి మొదటిసారిగా 37 వార్డు నుంచి గెలుపొందారు. ఆమె మామయ్య భోగ వెంకటేశ్వర్లు గతంలో టీడీపీ నుంచి కౌన్సిలర్‌గా పనిచేశారు. ఎమ్మెల్సీ రమణ అనుచరుడిగా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సైతం అప్పట్లో కొనసాగారు. ఆయన వారసురాలిగా రాజకీయ అరంగేట్రం చేసిన శ్రావణి వృత్తిరీత్యా డాక్టర్. కౌన్సిలర్‌గా గెలిచిన ఆమెకు అతి చిన్న వయస్సు (27 ఏళ్లలోనే)లోనే మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి వరించింది. కానీ.. ఆ పదవి మూడేళ్ల ముచ్చటే అన్నట్లు మిగిలిపోయింది. నాటకీయ పరిణామాల మధ్య ఆమె రాజీనామా చేయాల్సి వచ్చింది. కాగా.. శ్రావణి కొద్దిరోజుల క్రితం బీజేపీ అగ్రనాయకులతో మంతనాలు జరిపారనే ఆరోపణలు సైతం వినిపించాయి. త్వరలో బీజేపీలో చేరే అవకాశం ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. మరోవైపు బీజేపీ నాయకుల ద్వారానే ఈ తంతంగం అంతా జరుగుతోందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉంటారనే వార్తలు సైతం వస్తున్నాయి.



చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

కొత్త చైర్మన్‌కు అన్ని బాధ్యతలు..

- తెలంగాణ 2009 సెక్షన్ 34 ప్రకారం వైస్ చైర్మన్‌కు బాధ్యతలు ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కమిషనర్ బోనగిరి నరేశ్ చైర్మన్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వు కాపీ అందించారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గోలి శ్రీనివాస్‌కు పూర్తిస్థాయి అధికారం ఉంటుంది. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నుంచి మళ్లీ చైర్మన్ ఎన్నిక కోసం నోటిఫికేషన్ వచ్చేంత వరకు వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్ ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగుతారు. శ్రావణి రాజీనామాకు సంబంధించిన సమాచారాన్ని సైతం స్టేట్ ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

గోలి శ్రీనివాస్ ప్రొఫైల్..

- ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గోలి శ్రీనివాస్‌ది ఆర్యవైశ్య సామాజిక వర్గం. ఈయన వయస్సు 51ఏళ్లు ఇంటర్ చదువుకున్న శ్రీనివాస్ వ్యాపార రంగంలో కొనసాగుతున్నారు.
- గతంలో కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడిగా కొనసాగారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రోత్సాహంతో రాజకీయ అరంగేట్రం చేశారు. 44వ వార్డు కౌన్సిలర్‌గా విజయం సాధించారు.
- ఎప్పుడైనా మైనార్టీలకు దక్కే వైస్ చైర్మన్ పదవిని శ్రీనివాస్ దక్కించుకున్నారు.
- అనూహ్య పరిణామాల నేపథ్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి భోగ శ్రావణి రాజీనామా చేయడంతో.. ఇప్పటివరకు వైస్ చైర్మన్‌గా ఉన్న గోలి శ్రీనివాస్‌కు చైర్మన్‌గా అవకాశం వచ్చినట్లయ్యింది.

ఆశావహుల హడావుడి..

మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి రాజీనామా ఆమోదం కావడంతో ఆశావహుల్లో సందడి మొదలైంది. నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గోలి శ్రీనివాస్‌తో అప్పుడే సమావేశమయ్యారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయగానే చైర్‌పర్సన్ ఎన్నిక జరిగే అవకాశం ఉంటుంది. బీసీ మహిళ జనరల్ జగిత్యాల మున్సిపల్‌కు కేటాయించారు. ఇప్పటికే గతంలో చైర్‌పర్సన్ పదవిని ఆశించిన వారిలో సమిండ్ల వాణి, బండారు రజిని ఉండగా, ప్రస్తుతం వారి పేర్లే మళ్లీ వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రాజీనామా చేసిన భోగ శ్రావణి పద్మశాలీ వర్గానికి చెందిన వారు కావడంతో మరో పద్మశాలీ వర్గానికి చెందిన అడువాల జ్యోతికి ఇవ్వాలని ఆ వర్గం వారు కోరుతున్నారు.

అచ్చిరాని పదవులు

- జగిత్యాల నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో ఎవరూ ఉండలేకపోతున్నారు. జగిత్యాల రూరల్, అర్బన్ ఎంపీపీలు అనారోగ్యంతో మృతిచెందగా.. అందులో వైస్ చైర్మన్లే కొనసాగుతున్నారు. ప్రస్తుతం జగిత్యాల మున్సిపల్‌లో సైతం చైర్‌పర్సన్ భోగ శ్రావణి రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్‌కే బాధ్యతలు అప్పగించారు. ఇది జగిత్యాలలో చర్చనీయాంశంగా మారింది.

చైర్‌పర్సన్ పదవికే రాజీనామా..

కలెక్టర్ పిలిచి మరోసారి వివరణ కోరిన అనంతరం భోగ శ్రావని విలేకరులతో మాట్లాడారు. తాను చైర్‌పర్సన్ పదవికి మాత్రమే రాజీనామా చేశానని, బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని మాజీ చైర్ పర్సన్ శ్రావణి పేర్కొన్నారు. పదవిలో ఉండికూడా అభివృద్ధితోపాటు ఇతర పనులు ఏమీ చేయలేకపోతున్నామని, స్థానిక ఎమ్మెల్యే వేధింపులు భరించలేకనే తన పదవిని వదిలేశానని చెప్పారు. చైర్మన్ పదవిని ఉద్యమకారులకు ఇస్తారో..? బడా కాంట్రాక్టర్లకు ఇస్తారో చూడాలని ఆమె పేర్కొన్నారు. కలెక్టర్ మరోసారి రాజీనామాపై వివరణ కోరారని, తన ఇష్టపూర్వకంగా రాజీనామా చేసినట్లు ఒప్పు కున్నానని వెల్లడించారు. కౌన్సిలర్‌గా బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని పేర్కొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి చేస్తా

"శ్రావణి రాజీనామాతో వైస్‌చైర్మన్‌గా ఉన్న నన్ను చైర్మన్‌గా నియమించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సహకారంతో తోటి కౌన్సిలర్లతో సమన్వయంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తా. కొత్త చైర్మన్‌ను ఎన్నుకునే వరకు పారిశుధ్యం, ఇతరత్ర పనులపై శ్రద్ధ చూపి పట్టణాభివృద్ధిలో పాలుపంచుకుంటా."

– గోలి శ్రీనివాస్, మున్సిపల్ కొత్త చైర్మన్

క్లుప్తంగా

సింగరేణి డైరెక్టర్‌గా ఏపీఏ జీఎం ఎన్‌వీకే శ్రీనివాస్


ఎన్‌వీకే శ్రీనివాస్

రామగిరి(మంథని): అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా (ఏపీఏ) జీఎం ఎన్‌వీకే శ్రీనివాస్ సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్)గా నియమితులయ్యారు. శ్రీనివాస్ 2019 డిసెంబర్ 30న ఏపీఏ జీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఆత్యాధునికి టెక్నాలజీ కలిగిన అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌లో మూడేళ్లుగా విధులు నిర్వర్తిస్తూ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయనను సింగరేణి డైరెక్టర్‌గా నియమించినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎస్.చంద్రశేఖర్ మంగళవారం ఉద్యోగ విరమణ పొందనుండడంతో ఆయన స్థానంలో శ్రీనివాస్‌ను నియమించారు.

వాలీబాల్ జట్టు కోచ్‌గా కుమార్


కుమార్

ధర్మారం(ధర్మపురి): తెలంగాణ రాష్ట్ర సీనియర్ మహిళల వాలీబాల్ జట్టు కోచ్‌గా ధర్మారం మండలం కటికెనపల్లి ప్రభుత్వ పాఠశాల పీఈటీ తమ్మడవేని కుమార్‌ను ఎంపిక చేసినట్లు రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జెల రమేష్‌బాబు తెలిపారు. ఈసందర్భంగా కుమార్ ఎంపికపై వాలీబాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు.

తప్పిపోయిన చిన్నారి ఆచూకీ లభ్యం


చిన్నారిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి సంజయ్‌గాంధీనగర్‌లో సోమవారం తప్పిపోయిన చిన్నారి మమతా తాండీ దొరికింది. చిన్నారి ఇంటి వద్ద ఉన్న కంచె సమీపంలో ఆచూకీ లభ్యమైంది. పోలీసుల వివరాలు.. మమతాతాండీ క్రిస్మస్ పండుగ సందర్భంగా ఒడిస్సా నుంచి చిన్నమ్మ ఇంటికి వచ్చింది. అమ్మనాన్న మీద బెంగతో ఇంటికి వెళ్తా అని సోమవారం ఉదయం రోదించింది. కొద్ది సేపటి తరువాత కనిపించకపోవడంతో ఇంట్లోవారు కంగారుపడ్డారు. ఎంత వెతికినా దొరక్కపోవడంతో 100 నంబర్‌కు డయల్ చేశారు. ఎన్టీపీసీ ఎస్సై జీవన్ ఆదేశాల మేరకు బ్లూకోల్ట్స్ సిబ్బంది రంగప్రవేశం చేసి వెతకగా ఇంటి వద్దే ఉన్న కంచెలో దొరికింది. దీంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల సమయస్ఫూర్తికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆసరాపై ఆశలు..!

- భాగస్వామికి అందనున్న వితంతు పింఛన్
- ఇటీవలే జీవో జారీ చేసిన ప్రభుత్వం
- ఇప్పటివరకు 185 మంది అర్హుల గుర్తింపు


ఎంపీడీఓ కార్యాలయంలో జాబితా పరిశీలిస్తున్న అధికారులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): వృద్ధాప్య పింఛన్ పొందుతున్న లబ్ధిదారు మరణిస్తే వారి జీవిత భాగస్వామికి పక్షం రోజుల్లోనే ఆసరా కల్పించేలా ప్రభుత్వం ఇటీవల అధికారులకు ఆదేశించింది. దీంతో జిల్లాలో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇది వరకు భర్త చనిపోతే పింఛన్ కోసం భార్య కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఎప్పుడో ప్రభుత్వం కనికరిస్తేనే ఆసరా అందేది. మూడేళ్లుగా కొత్త పింఛన్లపై స్పందించని ప్రభుత్వం ఎట్టకేలకు గత ఆగస్టులో అన్ని విభాగాలకు సంబంధించి ఆసరా కొత్తకార్డులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. కానీ వృద్ధాప్య పింఛను పొందుతున్న ఇంటి పెద్దదిక్కు మరణిస్తే.. ఆయన అర్ధాంగికి కొత్తగా మంజూరు చేయలేదు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వితంతువులకు భరోసా కలగనుంది.

తక్షణమే ఆసరా

జిల్లాలో వద్ధాప్య పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు అనేకం. పెద్దదిక్కు కోల్పోయి వితంతు పింఛను కోసం దరఖాస్తు చేస్తున్నా అవి మంజూరు కాక మలి వయసులో ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు. అలాంటి వారి జీవితాలకు తక్షణమే భరోసా కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వృద్ధాప్య పింఛను పొందుతూ మృతిచెందిన భర్త స్థానంలో భార్యకు ఆసరా మంజూరు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 57 ఏళ్లలోపు మహిళలకు వితంతు, ఆ వయసు దాటిన వారికి వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని ఆదేశించింది. దీంతో క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ఈ తరహా కేసులకు సంబంధించి సర్వే ముమ్మరం చేశారు. ఇప్పటి వరకు జిల్లాలోని 14 మండలాల్లో 185 మందిని గుర్తించి దరఖాస్తులు స్వీకరించారు. ఆసరా పింఛను కోసం వితంతువులు సంబంధిత పంచాయతీ కార్యదర్శుల వద్ద దరఖాస్తు చేసుకోవాలి. జీవిత భాగస్వామి తన ఆధార్, బ్యాంకు ఖాతా, చనిపోయిన వ్యక్తి మరణ ధ్రువీకరణ ప్రతితో కార్యదర్శికి, పట్టణాల్లో బిల్ కలెక్టర్‌లకు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శులు వెంటనే ఎంపీడీవో, పురపాలక కమిషనర్‌కు పంపిస్తారు. వితంతు పింఛను మంజూరుకు ఆసరా పోర్టల్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొంది. వీరు వెంటనే గ్రామీణాభివృద్ధిశాఖ, కలెక్టర్ ఆమోదం కోసం పంపించాలి. వారు పోర్టల్‌లో ఆమోదించిన 15 రోజుల్లోనే పింఛను మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లావ్యాప్తంగా 266 గ్రామపంచాయతీలు, రామగుండం కార్పొరేషన్, సుల్తానాబాద్, పెద్దపల్లి, మంథని మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇలాంటి దరఖాస్తులకు సంబంధించి జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో సర్వే మొదలుపెట్టారు.

నిరంతరం కొనసాగిస్తాం

ఆసరా పొందుతున్న భర్తను కోల్పోయిన మహిళలకు తక్షణమే పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం భావించింది. ఇలాంటి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్న ప్రభుత్వ ఆదేశంతో కార్యదర్శులు సర్వే మొదలుపెట్టారు. ఇది నిరంతరం కొనసాగే ప్రక్రియ. వచ్చిన వాటిని పరిశీలించి కలెక్టర్ ఆమోదం కోసం పంపిస్తాం.

– శ్రీధర్, డీఆర్‌డీఓ

విన్నపాలు వినవలె..

- ప్రజావాణికి 54 దరఖాస్తులు
- సత్వరం పరిష్కరించాలంటూ కలెక్టర్ ఆదేశం



“సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు ఎలిగేడు మండలం బురహాన్‌మియాపేట నుంచి వీల్‌చైర్‌లో వచ్చిన తొంటి శాంతమ్మ వద్దకు కలెక్టర్ సంగీత స్వయంగా వచ్చి నీ సమస్య ఏంటమ్మా అంటూ మాట్లాడారు. తన సోదరి మల్లమ్మ పేరిట 36గుంటల భూమి ఉందని, అయితే కొత్త పాసుపుస్తకంలో కేవలం 20 గుంటలే చూపుతోందని, మిగతా 16 గుంటలు కూడా ఆన్‌లైన్‌లో వచ్చేలా చూడాలమ్మా.. అంటూ కలెక్టర్‌ను వేడుకుంది. అప్పటికప్పుడే ఎలిగేడు తహసీల్దార్‌తో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపాలని ఆదేశించారు.”


ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పలు ప్రాంతాల ప్రజల నుంచి 54 దరఖాస్తులను కలెక్టర్ సంగీత స్వీకరించారు. అందులో 38 రెవెన్యూ సంబంధమైనవే కాగా మిగతా 16 ఇతర శాఖలకు సంబంధించినవి. ప్రజా వాణిలో అందిన ఫిర్యాదులపై సత్వరమే పరిష్కారం చూపాలని, పరిష్కరించలేని సమస్యలకు కారణాలను వివరిస్తూ ఫిర్యాదుదారులకు తెలుపాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయాలి



చాల ఏళ్లుగా ఇండ్లు కట్టుకుని నివాసముంటున్న మా స్థలాలను మాకే ఇప్పించాలి. ఇక్కడ ఉంటున్న 72మందితో కలిసి వచ్చి కలెక్టర్‌కు మొరపెట్టుకున్నాం. మాకు న్యాయం చేయాలని వేడుకున్నాం.

– యమున, మంథని

ఆన్‌లైన్‌లో చూపుతలేరు



మాకు చందపల్లిలో సర్వేనంబరు 1,551లో ఎకరం 11 గుంటల భూమి ఉంది. ఇదివరకు పాసుపుస్తకం ఇచ్చిన అధికారులు ఇపుడు ఆ వివరాలను ఆన్‌లైన్‌లో చూపుతలేరు. ఈ కారణంగా రైతుబంధు అందక నష్టపోతన్నం.

– సతీష్, చందపల్లి

ప్రభుత్వ భూమిని కాపాడాలి



గ్రామంలో సర్వేనంబరు 117లో ఉన్న సర్కార్ భూమి (నాగులమ్మ గుట్ట)లో అధికారులు 400పైగా మొక్కలు నాటారు. వాటిని గ్రామ సర్పంచ్ కొండయ్య తొలగించి, భూమిని చదును చేసి ఆక్రమించుకున్నాడు. విచారణ జరిపి ప్రభుత్వ భూమిని కాపాడాలి.

– దుబాసి నాంపల్లి, సాయికృష్ణ, బురహాన్‌మియాపేట

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలోని కుంటల్లో నీరు నిల్వకుండా కొందరు ఆక్రమణకు పాల్పడుతున్నారు. కుంటలను సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలి. కబ్జాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– కలవేన రాజయ్య, సొసైటీ అధ్యక్షుడు, కొత్తపల్లి


జీఎం టూ డైరెక్టర్స్..!


భాస్కర్ రావు


చంద్రశేఖర్


వీరారెడ్డి


ఎన్‌వీకే. శ్రీనివాస్


ఏఎల్‌పీ గని

రామగిరి(మంథని): సింగరేణి అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ ఏరియా (ఏపీఏ)జీఎంలుగా పనిచేసిన నలుగురు డైరెక్టర్లుగా నియామకం కావడంతో అందరి దృష్టి ఏపీఏపైనే పడింది. ఇక్కడ జీఎంలుగా పని చేసిన బి.భాస్కర్‌రావు ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్స్ డైరెక్టర్, ఎస్.చంద్రశేఖర్ ఆపరేషన్స్ అండ్ పా, బి.వీరారెడ్డి ఈసీఎల్ (ప్రస్తుతం కోలిండియా డైరెక్టర్ (టెక్నికల్))గా ఎంపికయ్యారు. తాజాగా ఎన్‌వీకే. శ్రీనివాస్ సోమవారం నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆపరేషన్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. సింగరేణిలో ఇంప్లిమెంటేషన్ అండ్ ప్రాజెక్ట్ ప్లానింగ్ మానిటరింగ్ జీఎంగా పనిచేసిన బి.భాస్కర్‌రావు 2010 ఆగస్టు 19న ఏపీఏ జీఎంగా వచ్చారు. 2015 ఏప్రిల్ 15 వరకు లాంగ్‌వాల్‌లో సేవలు అందించారు. ఆయనను యాజమాన్యం ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జీఎంగా కొత్తగూడెం కార్పొరేట్‌కు బదిలీ చేసింది. ఆయన స్థానంలో సీఎండీ కార్యాలయంలో కో–ఆర్డినేషన్ జీఎంగా విధులు నిర్వహించిన ఎస్.చంద్రశేఖర్‌ను 2016 ఏప్రిల్ 16న ఏపీఏ జీఎంగా పంపించారు. 2017 మే1 వరకు పనిచేసిన ఆయన గని అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. అప్పటికే బి.రమేష్‌కుమార్, డైరెక్టర్ (ప్రాజెక్ అండ్ ప్లానింగ్స్), ఎ.మనోహర్‌రావు, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఉద్యోగ విరమణ పొందడంతో యాజమాన్యం డైరెక్టర్ల నియామకానికి ఇంటర్వ్యూ నిర్వహించింది. ఆ సమయంలో లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌లో పనిచేసిన అనుభవంతో భాస్కర్‌రావు (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్), చంద్రశేఖర్ (ఆపరేషన్స్)డైరెక్టర్లుగా ఎంపికయ్యారు. ఆ స్థానంలో ఏపీఏ ప్రాజెక్ట్ అధికారి బి.వీరారెడ్డికి 2017 జూన్30న జీఎంగా పదోన్నతి కల్పించింది యాజమాన్యం. యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని గని ప్రారంభం నాటినుంచి సాధించకపోవడాన్ని చాలెంజ్‌గా తీసుకున్న వీరారెడ్డి.. లక్ష్యాన్ని సాధిస్తూనే.. లాభాల బాటలోకి తెచ్చారు. ఈ క్రమంలో వీరారెడ్డి 2019 ఆగస్టు 28న ఈసీఎల్ డైరెక్టర్(టెక్నికల్)గా వెళ్లారు. ఆ సమయంలో హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ జీఎం(సేల్స్)గా పనిచేసిన ఎన్‌వీకే.శ్రీనివాస్‌ను ఏపీఏ జీఎంగా 2019 డిసెంబర్ 30న నియమించింది. ఆయన సుమారు మూడేళ్లపాటు ఏఎల్పీలో ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ మంచి పేరు సంపాదించారు. తాజాగా నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఈయన కూడా డైరెక్టర్(ఆపరేషన్స్)గా ఎంపికయ్యారు. ఇలా ఒకే ఏరియాలోని ఒకే గనిలో పనిచేసిన నలుగురు జీఎంలు డైరెక్టర్లు కావడంపై పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చెస్ పోటీల్లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్(పెద్దపల్లి): అల్ఫోర్స్ విద్యార్థులు అన్నిరంగాల్లో ప్రతిభ చాటుతున్నారని విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. మాస్ట్రో చెస్ అకాడమీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన 1,600 రేటెడ్ ఎంపిక పోటీల్లో అండర్–14 బాలికల విభాగంలో మధుశాలిని ప్రథమ, బాలుర విభాగంలో మహదేవ్ తృతీయ స్థానాలను కైవసం చేసుకుని జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఏపీఏ జీఎంగా వెంకటేశ్వర్లు

రామగిరి(మంథని): దేశంలోనే అత్యంత ఆధునిక పరిజ్ఞానం కలిగిన ఏపీఏ ఏరియా జీఎంగా కె.వెంకటేశ్వర్లును నియమిస్తూ సింగరేణి యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ జీఎంగా పని చేస్తున్న ఎన్‌వీకే శ్రీనివాస్ సోమవారం నిర్వహించిన ఇంటర్వ్యూలో డైరెక్టర్(ఆపరేషన్స్)గా నియమితులు కావడంతో ఆయన స్థానంలో ఎస్ఓటూ డైరెక్టర్(ఆపరేషన్స్)గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లును ఏపీఏ జీఎంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మామిడిలో యాజమాన్య పద్ధతులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త భాస్కర్‌రావు

రామగిరి(మంథని): మామిడి తోటలు పూతకు వస్తున్నాయి. దిగుబడులు సక్రమంగా రావాలంటే వాతావరణం అనుకూలించడంతో పాటు రైతు సరైన యాజమాన్య పద్ధతులను పాటించాలి. ఈనేపథ్యంలో మామిడి పంటలో పూత, పిందె దశలో చేపట్టే యాజమాన్య పద్ధతులు గురించి రామగిరి ఖిలా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బి.భాస్కర్‌రావు పేర్కొన్నారు.

నీటి యాజమాన్యం

ప్రతీ కాలంలో కొమ్మకు పూమొగ్గ/బొడ్డె రానంతవరకు ఆకులు ముందుకు వంగి ఉంటాయి. బొడ్డె బయటికి వచ్చిన తర్వాత ఆకులు వెనక్కి వస్తాయి. బొడ్డె వచ్చిన తర్వాత నీరు అందిస్తే దానిలోని హార్మోన్లు చెట్టు మొత్తం వ్యాపించి పూత వస్తుందని రైతుల్లో అపోహ ఉంది. ఈ దశలో నీటిని అందిస్తే కొన్ని పూమొగ్గలు, కొన్ని ఆకు మొగ్గలు కలిసివస్తాయి. పూత, పిందె దశలో నాఫ్తలిన్ అసిటిక్ ఆసిడ్ 1 గ్రాము మందు స్పిరిట్‌లో కరిగించి 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే బొడ్డె ముందుకు సాగుతుంది. ఈ సమయంలో నీటిని ఇవ్వడం వల్ల భూముల్లో పోషకాలను తీసుకొని ఒక్కసారి పూత రావడం జరుగుతుంది.

ఎరువుల వాడకం

పదేళ్ల వయస్సు దాటిన ఒక చెట్టుకు ఏడాదికి రెండు కిలోల యూరియా, ఆరు కిలోల సూపర్ ఫాస్పేట్, 1.5 కేజీల పొటాషియం రెండు దఫాలుగా ఇవ్వాలి. ఒక దఫా జూన్ లేదా జూలైలో, రెండో దఫా పిందె బఠాని గింజంత సైజు ఉన్నప్పుడు ఇస్తే పిందె సైజు, కాయ నాణ్యత పెరుగుతుంది. ఒకవేళ నీటి వసతి లేకుంటే పైపాటుగా 13.0.45ని 10 గ్రాములు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

చీడపీడల నివారణ

మామిడిలో జనవరి నుంచి మే వరకు ఆశించే తెగుళ్లలో తేనె మంచుపురుగు, తామర పురుగు, బూడిద తెగుళ్లు ముఖ్యమైనవి. తేనే మంచు పురుగు తల్లి, పిల్ల పురుగులు లేత ఆకులు, పుష్పగుచ్ఛాల ఎదుగుదల నుంచి రసాన్ని పీల్చడం వల్ల పూత, పిందె రాలిపోవడంతో పాటు పురుగు విసర్జించే తియ్యని పదార్థం మసికి కారణమై శిలీంద్రాలు పెరుగుతాయి. ఈ పురుగులు కాయలేని సమయంలో చెట్ల కాండం, కొమ్మల పగుళ్లలో దాక్కుంటాయి. పూత ప్రారంభమైన సమయంలో ఆశిస్తాయి. దీని నివారణకు డైమిథోమెట్ 2 మిల్లీ గ్రాములు లేదా క్లోరిపైరిపాస్ 2.5మిల్లీ గ్రాములు లీటర్ నీటిలో కలిపి పూత మొదలయ్యే సమయంలో పిచికారీ చేయాలి. పూ మొగ్గ దశలో కనిపించని యెడల ఇమిడాక్లోప్రిడ్ లీటర్ నీటిలో 0.3మిల్లీ లీటర్లు కలిపి పిచికారీ చేసి నివారించవచ్చు. తామర పురుగులు కొత్తగా చిగురు వచ్చే దశలో ఆకులపై చేరి రసాన్ని పీలుస్తాయి. పుష్పగుచ్ఛములు, పిందెలపై గోకి రసాన్ని పీల్చడం వల్ల కాయ నాణ్యత దెబ్బతింటుంది. దీని నివారణకు పెఫ్రొనిల్ 2మిల్లీ లీటర్లు లేదా అసిఫెట్ లీటర్ నీటిలో 1.5గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అడ్డుగా ఇనుప కంచె

- తొలగించిన తహసీల్దార్ అనుపమరావు


డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అడ్డుగా వేసిన ఇనుప కంచె

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఇళ్లు లేని నిరుపేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం మండల కేంద్రంలోని పాండవుల గుట్టవద్ద 480 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించింది. కాగా డబుల్ బెడ్‌రూంలకు సమీపంలో తమకు గతంలో ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులు భూమి కేటాయించారని పేర్కొంటూ ఇటీవల విశ్వబ్రాహ్మణ కుల సంఘం నాయకులు డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వెళ్లకుండా అడ్డుగా కంచె వేశారు. 597 సర్వే నంబరులో సుమారు 20 గుంటల వరకు ఇనుప కంచె వేయడంతో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వెళ్లేందుకు దారిలేకుండా అయిందని గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం తహసీల్దార్ అనుపమరావు సిబ్బందితో వెళ్లి ఇనుపకంచెను తొలగించారు. కాగా ఇదే స్థలంలో తాము కుల సంఘం కార్యాకలాపాలు కొనసాగిస్తూ జెండా పండుగలు చేస్తున్నామని, రెవెన్యూ అధికారులు కంచె తొలగించడంపై విశ్వబ్రాహ్మణ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. మరోచోట తమ కుల సంఘం కోసం స్థలం కేటాయించాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

డీసీపీని కలిసిన ఆర్జీ-1 జీఎం నారాయణ


పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీఎం నారాయణ

గోదావరిఖని(రామగుండం): పెద్దపల్లి డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన వైభవ్‌గైక్వాడ్‌ను ఆర్జీ–1 జీఎం కె.నారాయణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా జిల్లాలో కోల్‌బెల్ట్ ఏరియా విస్తరణ, బొగ్గు గనుల గురించి వివరించారు. ఆయన వెంట సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి ఉన్నారు.

నూతన డైరెక్టర్లను అభినందించిన జనక్‌ప్రసాద్


పుష్పగుచ్ఛం అందజేస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ నూతన డైరెక్టర్లుగా వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరావుల పేర్లను యాజమాన్యం సోమవారం ప్రకటించింది. ఈసందర్భంగా ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ నూతన డైరెక్టర్లను హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన డైరెక్టర్ల సారథ్యంలో సంస్థ లాభాల బాటలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న శంకరయ్య

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ ఆర్జీ–3లో విధులు నిర్వహిస్తున్న అద్దె వాహనాల డ్రైవర్ల సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య కోరారు. రెండు రోజులుగా అద్దె వాహనాల డ్రైవర్లు చేస్తున్న సమ్మెకు సోమవారం ఓసీపీ–2 గేట్ వద్ద సంఘీభావం తెలిపి మాట్లాడారు. సింగరేణిలో కార్మికుల పోరాట ఫలితంగా సెమీస్కిల్డ్ వేతనాలను స్కిల్డ్ వేతనాలుగా మార్చుతూ యాజమాన్యం అంగీకరిస్తూ గత అక్టోబర్ నుంచి అమలు చేస్తున్నా వాహనాల యజమానులు డ్రైవర్స్‌కు చెల్లించడం లేదని వివరించారు. తమకు స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని అద్దె వాహనాల డ్రైవర్లు చేస్తున్న సమ్మెకు గుర్తింపు సంఘం పూర్తి మద్దతు ఉంటుందని వెల్లడించారు. నైపుణ్యం, వీటీసీ, మెడికల్ ట్రైనింగ్ లేని డ్రైవర్స్‌తో వాహనాలు నడిపిస్తే జరిగే ప్రమాదాలకు సింగరేణి అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. యాజమాన్యం స్పందించి కార్మికుల సమస్యల పరిష్కారం చేస్తూ సమ్మెను విరమణ చేయించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆకుల వెంకన్న, బుర్ర తిరుపతి, కుమార్, సారయ్య, సతీష్, శంకర్, రమేష్, అమర్, సమ్మయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

పొలం దున్నుతుండగా బావిలో పడిన ట్రాక్టర్

- యజమానికి భయపడి డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి ట్రాక్టర్ బావిలో పడగా.. యజమానికి భయపడి డ్రైవర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన సోమవారం మండల కేంద్రంలో జరిగింది. స్థానికుల వివరాలు.. గ్రామానికి చెందిన నిమ్మల శ్రీధర్ అనే రైతు వద్ద అదే గ్రామానికి చెందిన రానవేన సాగర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పొలం దున్నుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి ప్రమాదవశత్తు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడింది. అప్రమత్తమైన డ్రైవర్ సాగర్ ట్రాక్టర్‌పై నుంచి దూకి తప్పించుకున్నాడు. కాగా యజమానికి భయపడి ఏమంటాడో అని ఆందోళనకు గురై పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సాగర్ ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.